సాక్షి
చిత్తూరు
ఆదివారం । 5 । మే । 2024



పలమనేరులో సీఎం వైఎస్ జగన్ సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్) ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని పిలుపునిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విజయోస్తు

ప్రజాసేవే పరమావధిగా నిస్వార్థంగా పనిచేస్తే.. ప్రకృతి సైతం సహకరిస్తుంది. పేదల కడుపు నింపడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కర్తవ్యం నిర్వర్తిస్తే సమస్త దేవగణమే అండగా కదలివస్తుంది. ఇందుకు శనివారం పలమనేరులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుంది. మండే ఎండ.. మిట్ట మధ్యాహ్నం.. అధిక ఉష్ణోగ్రతతో తీవ్రమైన ఉక్కపోత.. అభిమాన నేత ప్రసంగం వినేందుకు తరలివచ్చిన అశేష జనసందోహం.. వేసవి తాపంతో తల్లడిల్లిపోతోంది. ఇంతలో సీఎం వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ రానే వచ్చింది. పలమనేరు గడ్డపై సంక్షేమ ప్రదాత కాలుమోపగానే ఆకాశం మేఘావృతమైంది. జననేతకు విజయోస్తు అంటూ వరుణుడి ఆశీర్వాదం లభించింది. ఒక్కసారిగా కుంభవృష్టి మొదలైంది. వాతావరణం అనూహ్యంగా చల్లబడింది. పలమనేరు పులకించింది.

- సీఎం వైఎస్ జగన్ సభకు పోటెత్తిన ప్రజానీకం
- మండు వేసవిలో కుంభవృష్టితో వరుణుడి ఆశీర్వాదం
- సంక్షేమ ప్రదాతకు అడుగడుగునా అపూర్వ స్వాగతం
- జై జగన్ నినాదాలతో హోరెత్తించిన జనం


జగనన్నకు జై అంటున్న భావి పౌరుడు


మా భవిష్యత్‌కు అండ.. ఈ జెండా


చిన్నారి చేతుల్లో కొండంత ధైర్యం..

సాక్షి, చిత్తూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలమనేరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పలమనేరు జై జగన్ నినాదాలతో మార్మోగింది. ఈ క్రమంలో ఉదయం నుంచే పెద్దసంఖ్యలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పట్టణానికి తరలివచ్చారు. పట్టణంలోని క్లాక్ టవర్ సర్కిల్ వద్ద సభాస్థలికి చేరుకుని తమ అభిమాన నేతను చేసేందుకు పడిగాపులు కాచారు. వేసవి నేపథ్యంలో తీవ్రమైన ఎండ మండుతున్నా లెక్కచేయకుండా నృత్యాలు చేస్తూ జగనన్న రాకకోసం ఎదురుచూశారు.

కిక్కిరిసిన క్లాక్‌టవర్ సర్కిల్

పలమనేరులో కనీవినీ ఎరుగని రీతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు జనం తరలివచ్చారు. కూడలికి అటు ఇటూ రెండు వైపులా రోడ్లపై జనం కిక్కిరిసిపోయారు. ఒక్క సభా ప్రాంగణం వద్దే సుమారు 50 వేలకు పైబడి నిలబడ్డారు. తొక్కిసలాట జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సభా ప్రాంగణానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు రాకుండా ఎక్కడిక్కడ ఆపేశారు. దీంతో వెలుపల వీధుల్లో కూడా జనం వేలాదిగా నిలబడిపోవడం కనిపించింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 2.37 గంటలకు ప్రసంగం ప్రారంభించి 3.07 గంటలకు ముగించారు. సరిగ్గా అరగంట సమయం పాటు చిరు జల్లుల మధ్య సీఎం జగన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల్లో ఒక్కొక్కటిగా వివరించారు. టీడీపీ మేనిఫెస్టోలోని డొల్లతనాన్ని ఎండగట్టారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబును నమ్మితే చంద్రముఖిని నిద్రలేపినట్టే అని హెచ్చరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తిరుగులేని మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.


వర్షంలోనే కిక్కిరిసిన జనం నడుమ సభా స్థలికి చేరుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సభ సూపర్ సక్సెస్

పలమనేరులో సీఎం జగన్ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. నియోజవర్గంలోని పలమనేరు, పలమనేరు రూరల్, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమన్వయంతో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి , సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, పలమనేరు నియోజవర్గం మాజీ కో–ఆర్డినేటర్ సీవీ కుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరుణుడి ఆశీస్సులు

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బహిరంగ సభను మధ్యాహ్నం నిర్వహించారు. ఆయన పలమనేరుకు రాక ముందు వరకు ఎండ తీవ్రస్థాయిలో ఉంది. అయితే సీఎం జగన్ హెలికాప్టర్ దిగిన మరుక్షణమే వాతావరణం మారిపోయింది. చిరుజల్లులు.. చల్లటి పిల్లగాలులతో పలమనేరు పరవశించింది. సీఎం జగన్ ప్రసంగం ఆరంభించగానే వర్షం ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో సీఎం జగన్ సైతం చిరునవ్వులు చిందిస్తూ.. ''దేవుడి దయతో మండుటెండలో సైతం చక్కటి వర్షం పడింది. మీ చిక్కటి చిరునవ్వుతోపాటు ఈ వర్షం కూడా దేవుడి ఆశీస్సులుగా భావిస్తున్నా..'' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. పలమనేరు ప్రజల ప్రేమ, ఆప్యాయత , అనురాగం మరచిపోలేనని చెప్పడంతో ''జయహో జగన్..'' అంటూ జనం విశేషంగా స్పందించారు.

అమ్ముడుబోయే అమర్‌ను నమ్మొద్దు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్‌సీపీలో గెలిచి, మంత్రి పదవి కోసం టీడీపీకి అమ్ముడుబోయిన అమరనాథరెడ్డిని నమ్మవద్దని ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కోరారు. ముఖ్యమంత్రి సభలో వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేసిన అమర్ పలమనేరుకు ఒక్క పరిశ్రమనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో తాము 70 శాతం రోడ్లు పూర్తి చేశామని, మిగిలిన పనులను స్వార్థంతో అమర్ అడ్డుకున్నారని మండిపడ్డారు. పల్లెల్లోకి వెళ్లి చూస్తే ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగు లక్షలు ఉద్యోగాలిచ్చామని వెల్లడించారు. అమర్ తాను పొందిన పదవులను ఆస్తులు పెంచుకునేందుకు ఉపయోగించుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఒక్క పలమనేరు నియోజకవర్గంలోనే సంక్షేమం, అభివృద్ధి పథకాలకు రూ.2,700 కోట్లు ఖర్చుపెట్టిందని వివరించారు. టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డికి పేదల అభ్యున్నతి పట్టదని, కేవలం తాను, తన బంధువులు అభివృద్ధి మాత్రమే కావాలని విమర్శించారు.


మాట్లాడుతున్న రెడ్డెప్ప, అభివాదం చేస్తున్న వెంకటేగౌడ


ఉప్పొంగిన ఉద్వేగం


ఈల వేస్తూ ఉరకలెత్తిన ఉత్సాహం


జగనన్నా నీ మంచి మనసుకు సెల్యూట్..


ఉప్పొంగిన అభిమానం


నేలను దాటి మిద్దెలెక్కిన అభిమానం


సంక్షేమ సారథి రాకకై..

నేడు చిత్తూరులో మంత్రి పెద్దిరెడ్డి సభ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ప్రజలు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మామిడి రైతుకు గిట్టుబాటు ధర


గోవర్ధన్‌బాబీ, జిల్లా పండ్ల సమాఖ్య కార్యదర్శి

చిత్తూరు అగ్రికల్చర్: మామిడి రైతుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏటా గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని జిల్లా పండ్ల సమాఖ్య కార్యదర్శి గోవర్ధన్ బాబీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం మామిడి గుజ్జు పరిశ్రమలను బలిచేయడం మంచి పద్ధతి కాదన్నారు. గత ఏడాది మే10వ తేదీన గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో టన్నుకు రూ.19వేలు రైతులకు చెల్లించాలని ఆదేశించినా అమలు కాలేదని ఈనాడు దినపత్రికలో వార్త ప్రచురించారని, అయితే అప్పట్లో కలెక్టర్ ఆదేశించింది వారం రోజులు ఆ ధర చెల్లించాలని మాత్రమే సూచించారని వెల్లడించారు. ఆ సమయంలో మామిడి దిగుబడి రాలేదని, జూన్‌లో కాయల దిగుబడి వచ్చిన తర్వాత మార్కెట్ రేటు కంటే రూ.2లు అధికంగా రైతులకు చెల్లించామని వివరించారు. కనీస ధర కిలోకు రూ.10 తక్కువ కాకుండా రైతులకు ఇచ్చామని తెలిపారు. వాస్తవాలను కప్పిపుచ్చి తప్పుడు వార్తలు రాయడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

పకడ్బందీగా ఓటరు స్లిప్పుల పంపిణీ


షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని, సోమవారంలోపు మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లందరికీ స్లిప్పులు చేరేలా ఆర్‌ఓలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 5,6 తేదీల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్‌బ్యాలెట్‌కు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్‌బ్యాలెట్ రికార్డులు పక్కాగా నిర్వహించాలని కోరారు. పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుని క్యూలు, శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగిసిన వెంటనే బాక్సులను పకడ్బందీ భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని చెప్పారు. ఈ నెల 6,7 తేదీల్లో హోం ఓటింగ్ ప్రక్రియను జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇక్కడ పనిచేస్తూ ఇతర జిల్లాల్లో పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్‌బ్యాలెట్ వేయాలని స్పష్టం చేశబూరు. పోస్టల్‌బ్యాలెట్ వేసేందుకు వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా ఎపిక్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రభుత్వం జారీచేసిన గుర్తింపుకార్డుల్లో ఏదైన ఒకటి, ఎన్నికల విధులకు కేటాయించిన ఉత్తర్వులను తీసుకుని రావాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశముంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

పక్కాగా ఈవీఎంల ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను పక్కాగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అబ్జర్వర్లు,అభ్యర్థుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిఘా నీడలో 2,318 బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించా రు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

వి.కోట: పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన విషయం శనివారం వెలుగుచూసింది. కాలనీలో నివసిస్తున్న నవనీతమ్మ తమ కుటుంబీకులతో కలిసి ఈ నెల 2వ తేదీన బెంగళూరు వెళ్లింది. తిరిగి శనివారం ఇంటికి వచ్చింది. తలుపులు, బీరువా పగులగొట్టి ఉండడంతో దిగ్భ్రాంతి చెందింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 80 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి, కొంత నగదు అపహరించినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

గడ్డివాము దగ్ధం



కాలుతున్న గడ్డి

వెదురుకుప్పం : మండలంలోని ఆళ్లమడుగు ఎస్సీ కాలనీలో శనివారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో గోవిందస్వామి అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డి పూర్తిగా కాలిపోవడంతో రూ.25 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



యూనిఫామ్ ఆర్డర్‌ను పూర్తి చేసి పంపుతున్న నేత కార్మికులు (ఫైల్)

నాడు ఖేదం.. నేడు మోదం

స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా ఎల్లోమీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోంది. టీడీపీకి లబ్ధి చేకూర్చేందుకు తప్పుడు రాతలకు తెగబడుతోంది. గత సర్కారు హయాంలో పట్టించుకునేవారు లేక కునారిల్లిన మర మగ్గం కార్మికులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మంత్రి రోజా చొరవతో ఎప్పటికప్పుడు సహకారం అందించింది. కోవిడ్ సమయంలో ఆర్డర్లు ఇప్పించి ఊపిరి పోసింది. విద్యుత్ చార్జీలను సైతం తగ్గించి ప్రోత్సహించింది. వెన్ను వంగిన నేతన్నకు పింఛన్ అందించి ఆదుకుంది.

- టీడీపీ హయాంలో దగా పడిన నేతన్నలు
- పాలకుల నిర్లక్ష్యంతో వలసలు
- మరమగ్గం కార్మికులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో సహకారం అందించిన మంత్రి రోజా

నగరి : అబద్ధాలను పదే పదే వల్లిస్తే అదే నిజమని ప్రజలు నమ్మేస్తారనే ధోరణితో ఎల్లోమీడియా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నా బురదజల్లడమే లక్ష్యంగా తప్పుడు కథనాలు ప్రచురిస్తోంది. అందులో భాగంగా శనివారం 'మర మగ్గం కార్మికులను దగా చేసి..' శీర్షికలతో ఈనాడు ఓ అసత్య కథనాన్ని వెలువరించింది. అయితే మర మగ్గం కార్మికులను పట్టించుకోనిది మంత్రి రోజా కాదు.. టీడీపీయే అనే వాస్తవాలను వక్రీకరించింది. ఒక్క మీటరు ఆర్డరు ఇప్పించింది లేదు. ఒక్క కార్మికుడికి శిక్షణ ఇప్పించింది లేదు. తమిళ మాధ్యమంలో చదువుకునే కార్మికుల పిల్లలకు ఒక్క పుస్తకం అందించింది లేదు. ఇంతటి ఘనంగా మరమగ్గం కార్మికులకు సహకరించిన గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకాలు అవాస్తవాల ఈనాడు పత్రికకు కనపడవు.

నిత్యం తోడుగా ఉంటూ..

మంత్రి ఆర్కే రోజా నగరి నియోజకవర్గంలోని మర మగ్గం కార్మికులకు నిత్యం తోడుగా నిలిచారు. కోవిడ్ కష్టాల్లో పూట గడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్న కార్మికులను ఆదుకున్నారు. ప్రభుత్వం పాఠశాల యూనిఫామ్ నిమిత్తం 23 లక్షల మీటర్ల ఆర్డరు ఇప్పించారు. పట్టుచీరల నేతపైనా, ఆధునిక మరమగ్గాలపైనా శిక్షణ అందించారు. తమిళ మాధ్యమానికి చెందిన మరమగ్గ కార్మికుల పిల్లలకు తమిళ పాఠ్యపుస్తకాలు ఇప్పించారు. మరమగ్గ కార్మిక సామాజికవర్గం వారు అత్యధికంగా వినియోగించుకునే ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌ను కేంద్ర మంత్రితో చర్చించి నవీకరించారు. గత టీడీపీ పాలనలో చాలా కొద్ది మందికి మాత్రమే పెన్షన్ వచ్చేది. నేడు 2,670 మందికి వీవర్ పెన్షన్లు అందిస్తున్నారు. రంగునీటి శుద్ధీకరణ ప్లాంటును గత పాలకులు నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిస్తే.. దానికి చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు రూ.2.75 కోట్లు చెల్లించేలా చర్యలు చేపట్టారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ మేరకే మరమగ్గాలకు విద్యుత్ కేటగిరి మారిపోయింది. ఆ సమస్యను కూడా మంత్రి రోజా చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఇది ఇక్కడి వాస్తవ పరిస్థితి. ఈ నిజాలను ఎంతగా దాచాలని ఎల్లోమీడియా ప్రయత్నించినా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలుసు కాబట్టి వారిది విఫలయత్నమే.



ఈనాడులో ప్రచురితమైన కథనం

టీడీపీ పాలనలో మేలు జరగలేదు



టీడీపీ పాలనలో మరమగ్గ కార్మికులకు ఎలాంటి మేలు జరగలేదు. మున్సిపల్ పన్నులు రద్దు చేస్తామని చెప్పి మోసం చేశారు. దీంతో పన్నులు పెరిగి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వమే మాకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. విద్యుత్ చార్జీలు సైతం తగ్గించింది.

- కళైసెల్వన్, మరమగ్గ కార్మికుడు, నగరి

రోజమ్మే ఆదుకున్నారు



2014 ఎన్నికల్లో మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారు. ఇవ్వలేదు. ఈటీపీ ప్లాంటును గాలికి వదిలేశారు. ఎలాంటి ఆర్డర్లు ఇప్పించలేదు. అప్పట్లో పలువురు పనులు మానేసి చెన్నైలో పెళ్లిళ్లకు సర్వర్లుగా వెళ్లేవారు. ప్రభుత్వ ఆర్డరును ఇప్పించి రోజమ్మే ఆదుకున్నారు.

- రవి, మరమగ్గ కార్మికుడు, పుదుపేట.

నాడు కబ్జాకోరు..నేడు కడిగిన ముత్యమా..?

- పచ్చ పత్రికల పక్షపాత కథనాలకు 'ఆరణి' సాక్ష్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు. ఈయనకు భూ బకాసురుడిగా గొప్ప పేరుంది. చిత్తూరు నియోజకవర్గంలో ఆరణి చేసిన భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు అంతే లేదు అంటూ గత ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి, ఈనాడులో కథనాలు ప్రచురించారు. ఈ క్రమంలో ఆరణి శ్రీనివాసులకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు టికెట్ నిరాకరించింది. ఆయనేమో వెంటనే జనసేన కండువా కప్పుకుని తిరుపతి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగారు. కూటమిలో చేరగానే పచ్చ పత్రికలకు ఆరణి కడిగిన ముత్యంలా కనిపిస్తున్నారు. ఆరణి అంత మంచి వ్యక్తి మరొకరు లేరంటూ సదరు పత్రికలు ఆకాశానికి ఎత్తేస్తున్నాయి. ఇంతటి మహానుభావుడిని గెలిపించుకోకుంటే తిరుపతి వాసుల ఖర్మ అన్నట్లు కథనాలు వెలువరిస్తున్నాయి. మరి గతంలో ఆరణి శ్రీనివాసులుకు వ్యతిరేకంగా ప్రచురించిన కథనాలకు ఏమని సమాధానమిస్తారో మరి..?!





ఆంధ్రజ్యోతిలో ఆరణిపై ప్రచురితమైన కథనాలు



ఈనాడులో ఆరణి శ్రీనివాసులుపై వచ్చిన కథనం

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరుతున్న శ్రీనివాసులురెడ్డి, పక్కన మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

- ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరిన శ్రీనివాసులురెడ్డి

పలమనేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో బైరెడ్డిపల్లె మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత లక్కనపల్లె శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం పలమనేరుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆయన కలిశారు. శ్రీనివాసులురెడ్డికి ముఖ్యమంత్రి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్నానని, మాజీ మంత్రి అమరనాథరెడ్డి కారణంగా ప్రస్తుతం పార్టీకి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వ లక్షణాలకు ఆకర్షితుడినై వైఎస్సార్‌సీపీలో చేరానని, వెంకటేగౌడను గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో పని చేస్తానని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన టీడీపీ నేతలు రమేష్‌నాయుడు(గణపతి నాయుడు), ఉమాపతినాయుడు, బాబునాయుడు, అమరేంద్రబాబు, జగన్నాథనాయుడుతో పాటు పలువురు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, పార్టీ మండల ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు హరిరెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌సుందరరాయల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీకు మొగుడు లేడా..?

- ఆమెకు ఉన్నా వెళ్లిపోయాడా...?
- మీ ఊళ్లో అందరూ ఇంతేనా
- ఓటు ఫ్యాన్‌కు .. సమస్యలు మాకా..?
- ఎస్సీ ఎస్టీ మహిళలపై టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అనుచిత వ్యాఖ్యలు



గుడిపాల: పెరుమాళ్లకుప్పంలోని మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి గురజాల

గుడిపాల/చిత్తూరు అర్బన్: చిత్తూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు ఎస్సీ, ఎస్టీ మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. అందరి ఎదుటే దళిత మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి వెంటనే అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని.. ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల మండలం కనకనేరి ఆది ఆంధ్రవాడలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

టీడీపీ చిత్తూరు అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ నాయుడు తదితరులు మందీ మార్బలంతో శనివారం కనకనేరి గ్రామానికి ఎన్నికల ప్రచారం కోసం వెళ్లారు. ఇక్కడున్న ఆది ఆంధ్రవాడకు చెందిన మహిళలు యానాదులకు చెందిన మహిళలను ఓంశక్తి గుడి వద్దకు జగన్మోహన్ నాయుడు పిలిపించాడు. మీకు గ్రామంలో ఏం సమస్య ఉందో చెప్పాలని మహిళలను అడగగా.. నీటి సమస్య ఎక్కువగా ఉందని పారిశుద్ధ్యం సరిగా లేదని మహిళలు సమాధానమిచ్చారు. దీంతో టీడీపీ అభ్యర్థి జగన్మోహన్ నాయుడు 'నేను ఐదేళ్ల ముందే వచ్చినప్పుడు మీకు చెప్పినాను కదా ఫ్యాన్‌కు ఓటేయవద్దు అని. నా మాట వినలేదు. ఇప్పుడు అనుభవిస్తున్నారు, అనుభవించండి. ఓటు ఫ్యాన్ గుర్తుకు వేస్తారు, సమస్యలు మాకు చెబుతారా? ఎగేసుకొని పోయి ఓటు వేసినారు కదా ఫ్యానుకు.. అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇంకా ఆయన మాట్లాడుతూ ఈసారి మాకే ఓటేస్తామని మహిళలంతా వచ్చి దేవుని ఎదుట ప్రమాణం చేయాలని హుకుం జారీ చేశాడు. అంతటితో ఆగకుండా.. 'ఏమిరా మీ ఊరులో పెళ్లిళ్ల చేసుకుని మొగుళ్లని వదిలేస్తారంట కదా.. ఆమేమో మొగుడ్ని వదిలేసాను అంటది ఈమేమో మొగుడు ఉండాడు యాడికో పోయినాడు అంటాది. మీ ఊరంతా ఇట్లాంటోళ్లేనా ఉండేది' అంటూ దళితుల మనోభావాలు కించపరిచేలా మాట్లాడాడు. ఇలాంటి వ్యక్తికి ఓట్లేసి గెలిపిస్తే దళితులపై ఇంకా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సరే తగ్గకుండా చివర్లో తాము ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామంటూ మహిళలంతా తేల్చి చెప్పడంతో జగన్మోహన్ నాయుడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు కులాహంకారాన్ని వ్యక్తపరిచేలా జగన్మోహన్ నాయుడు చేసిన ఈ వ్యాఖ్యల పట్ల దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. చిత్తూరుకు చెందిన మేయర్ అముద, మాజీ చైర్మన్ తదితరులు జగన్మోహన్ నాయుడు వ్యాఖ్యలను ఖండిస్తూ అతనిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గుడిపాల మండలంలోని దళిత నాయకులు మాట్లాడుతూ గురజాల జగన్మోహన్ నాయుడును ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు తెలిపారు.